సాక్షి నాగర్‌కర్నూల్


మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



ఘనంగా శకటోత్సవం

జడ్చర్లలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా శకటోత్సవం నిర్వహించారు.

వివరాలు 10లో ▸



తెగిన కేఎల్‌ఐ కాల్వ

కోడేరు మండలం ముత్తిరెడ్డిపల్లి శివారులో కేఎల్‌ఐ కాల్వ తెగి నీరు వృథాగా పోతుంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /19.3

వాతావరణం

రోజంతా ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. రాత్రికి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'ప్రజావాణి' ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు దృష్టిసారించి పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ మోతిలాల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 26 దరఖాస్తులు రాగా, అందులో అధికంగా ధరణి భూ సమస్యలు, వృద్ధాప్య పింఛన్లు, స్వయం ఉపాధికి సంబంధించి వచ్చాయి. ఫిర్యాదులను ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సీపీఓ భూపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు రెండు..

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. సోమవారం ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు ప్రజావాణికి రెండు ఫిర్యాలు వచ్చాయని ఇందులో అప్పుతీసుకున్న వ్యక్తి డబ్బులు లేదనే ఫిర్యాదు, తల్లిదండ్రుల సంక్షేమం చూడటం లేదనే ఫిర్యాదులు ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు.

హాత్ సే హాత్ యాత్ర ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: టీపీసీసీ సభ్యుడు జగదీశ్వరావు సోమవారం హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. మండలంలోని సోమశిలలోని లలితా సోమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాత్రలో భాగంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి పనులను ఆయన వివరించారు. పోడు భూముల సమస్యలను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలకు అన్ని ఏర్పాట్లు

కందనూలు: సామూహిక వివాహాలు వైభవంగా నిర్వహించనున్నట్లు, అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంజేఆర్ ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వివరించారు. సామూహిక వివాహాల నేపథ్యంలో నియోజకవర్గ టీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలో సోమవారం ట్రస్ట్ డైరెక్టర్స్ మర్రి జమున రాణి, జక్క రఘునందన్‌రెడ్డి నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 12న నిర్వహించే సామూహిక వివాహాలకు నియోజకవర్గంలోని ప్రజలందరూ కుటుంబ సమేతంగా హాజరై వధూవరులను ఆశీర్వాదించాలని కోరారు. ఒకే వేదికపై ఒక్కటవుతున్న 220 మంది నూతన వధూవరులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి ఆతిథ్యాన్ని స్వీకరించాలని పిలుపునిచ్చారు. 10వ తేదీన జెడ్పీ మైదానంలో మెహెందీ, పసుపు కొట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ సరికాదు

కందనూలు: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసి, ఇతర ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను ప్రైవేటీకరించడం ద్వారా కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబానీలకు రూ.లక్షల కోట్లు ప్రయోజనం చేకూరుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోడీ లాభాలలో ఉన్న సంస్థలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు రుణాల కోసం వెళ్తే, ఆంక్షలు పెట్టే బ్యాంక్ అధికారులు రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని అదానీ, అంబానీలకు కట్టబెట్టరని ఆరోపించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అర్థం రవి మాట్లాడారు. బాలగౌడ్, పాండు, కోటయ్య, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య, వెంకటయ్యగౌడ్, ఎండీ నిజాముద్దీన్, తీగల సురేంద్ర, సుల్తాన్ పాల్గొన్నారు.

సంక్షేమమే కానీ..

- రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- మౌలిక వసతుల కల్పనకూ ప్రాధాన్యం
- దళిత బంధు, వ్యవసాయరంగానికి పెద్దపీట
- సొంత స్థలంలో 'డబుల్' ఇళ్లకు కేటాయింపులు
- సాగునీటి ప్రాజెక్టులకు అత్తెసరేనంటున్న ప్రతిపక్షాలు
- ఊసేలేని నిరుద్యోగ భృతిపై విమర్శలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీలో సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్దపీట వేశారు. ఆసరాతో పాటు వ్యవసాయ రంగం, దళిత బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. స్థానిక సంస్థలకు నిధులు నేరుగా అకౌంట్లకే జమ చేయనున్నట్లు వెల్లడించడంతో పాటు పట్టణ, పల్లె ప్రగతికి నిధులు కేటాయించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కేటాయించడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు నిధులు కేయించడంతో పలు మార్గాలు బాగుపడుతాయనే ప్రజలు ఆశిస్తున్నారు. అయితే రుణమాఫీకి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదని.. నిరుద్యోగ భృతి ఊసేలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఉమ్మడి పాలమూరులోని సాగునీటి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో అరకొరగానే నిధులు కేటాయించారని ప్రతిపక్షాలు అంటున్నాయి. గత బడ్జెట్ కంటే కేటాయింపులు పెంచినప్పటికీ.. పాలమూరు ప్రాజెక్టుల పూర్తిపై చిత్తశుద్ధి కనిపించలేదని విమర్శిస్తున్నాయి. ప్రతి జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని గతంలోనే ప్రకటించారు. మహబూబ్‌నగర్‌లో గతంలోనే, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి. వీటితో పాటు గద్వాల, నారాయణపేటలో వచ్చే ఏడాది తరగతులు ప్రారంభమవుతాయని జిల్లా పర్యటలో ముఖ్యనేతలు ప్రకటించినా.. ఈ బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడంపై ఆ జిల్లావాసుల్లో నిరాశ అలుముకుంది.



ఆర్థిక బడ్జెట్ ప్రసంగంలో 'పాలమూరు' ప్రస్తావన..

- 'రాష్ట్రంలో జేఎన్‌టీయూ పరిధిలో నాలుగు కొత్త ఇంజినీరింగ్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వీటిలో సిరిసిల్ల, వనపర్తి కళాశాలలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. త్వరలోనే మహబూబ్‌నగర్, కొత్తగూడెంలో ప్రారంభించనున్నాం.'
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణం దాదాపు 60 శాతం పూర్తయింది. ఈ దశలో కొన్ని ప్రతీపశక్తులు కుట్రపూరితంగా కేసులు వేస్తూ అడ్డుకుంటున్నాయి. త్వరలోనే పర్యావరణ అనుమతులు సాధించి శరవేగంగా ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కంకణబద్ధమై ఉంది.'
- 'కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌తో పాటు పలు జిల్లాల్లోని తదితర పెండింగ్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేసింది. దీంతో 20 లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి అయింది. కరువుపీడిత ప్రాంతంగా, వలసల జిల్లాగా పేరుపడ్డ ఉమ్మడి పాలమూరు నేడు పచ్చని పంటలకు నెలవైంది. పాలమూరులో దొరికే వ్యవసాయ పనులకు ఇతర రాష్ట్రాల రైతు కూలీలు వలస వస్తున్నారంటే పరిస్థితిలో వచ్చిన మార్పును అర్థం చేసుకోవచ్చు.'
- సాఫ్ట్‌వేర్ ఎగుమతులు, పెట్టుబడుల్లో దేశంలోనే తెలంగాణ నంబర్-1 స్థానానికి ఎదిగింది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ పరిశ్రమలను ఏర్పాటుచేస్తున్నాం. మహబూబ్‌నగర్ నిర్మాణం పూర్తయిన ఐటీ టవర్‌ను ఈ ఏడాదే ప్రారంభిస్తాం.'

దళితబంధు: ఒక్కో సెగ్మెంట్‌కు 1,100 యూనిట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో దళితబంధుకు గత ఏడాది కేటాయించినట్లే ఈసారి రూ.17,700కోట్లు కేటాయించారు. ఈ మేరకు నియోజకవర్గానికి 1,100 యూనిట్లు చొప్పున దళిత కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆయా వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతుండగా.. గిరిజన బంధుపై ఊసే లేకపోవడం ఆ వర్గాలను నిరాశకు గురిచేసింది.

'డబుల్' : నియోజకవర్గానికి 2వేల ఇళ్లు

సొంత జాగా ఉంటే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేసేందుకు బడ్జెట్‌లో రూ.7,980 కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల ఇళ్లను కేటాయించనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకు సంబంధించి 28 వేల మందికి లబ్ధి చేకూరనుంది. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల పూర్తికి రూ.12 వేల కోట్లు కేటాయించిన నేపథ్యంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాజెక్టులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలు ప్రాజెక్ట్‌లకు **బడ్జెట్‌లో కేటా**యింపులు చేశారు. అత్యధికంగా **పాలమూరు-రం**గారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు **రూ.1187.64** కోట్లు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.212.14 కోట్లు, నెట్టెంపాడుకు రూ.120 కోట్లు కేటాయించారు. మొత్తానికి జిల్లాలోని అన్ని ప్రాజెక్ట్‌లకు గత బడ్జెట్‌లో రూ.1643.45 కోట్లు కేటాయించగా.. ఈ సారి రూ.1603.89కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది.

ప్రాజెక్టులకు సంవత్సరాల వారీగా బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)..

ప్రాజెక్టు	2021-22 కేటాయింపులు	2021-22 సవరణ	2022-23 కేటాయింపులు	2022-23 సవరణ	2023-24 కేటాయింపులు
పాలమూరు-రంగారెడ్డి	1034.10	1034.10	1225	852.64	1187.64
నెట్టెంపాడు	191.90	191.90	120	55.08	120
కోయిల్‌సాగర్	18.32	18.32	44.40	25.63	29.53
సంగంబండ	21.95	21.95	5.21	12.44	19.89
రాజీవ్ భీమా (ఏఐబీపీ)	---	---	13.94	10.92	13.94
రాజీవ్ భీమా (స్టేట్)	---	---	39.80	18.70	75 లక్షలు
జూరాల-పాకాల	3.00	3.00	10 లక్షలు	1లక్ష	---
కేఎల్‌ఐ	74.10	74.10	175.00	121.80	212.14
ఆర్డీఎస్	---	---	10	22.59	10
జూరాల	---	---	10	37.54	10
మొత్తం	---	---	1643.45	1157.35	1603.89

ప్రజా సంక్షేమ బడ్జెట్



ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. దళిత బంధు, పక్కా ఇళ్ల నిర్మాణాలతో పాటు పలు అంశాల్లో పేదలకు ఉపయోగపడే పనులకు నిధులు వెచ్చించారు. ఉపాధి అంశాలకు కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారు.

– బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

అన్ని వర్గాలకు సంక్షేమం..



రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత దక్కింది. అందరి సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోంది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, సంక్షేమం, ఎస్సీ అభివృద్ధికి సమృద్ధిగా నిధులు కేటాయించింది. రైతుల రుణమాఫీతో పాటు నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది.

– మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

వ్యవసాయానికి పెద్దపీట



రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. వ్యవసాయ రంగానికి రూ.26,831కోట్లు కేటాయించింది. అలాగే రైతుబంధుకు రూ.1,575కోట్లు, రైతుబీమాకు రూ.1,589కోట్లు, విద్యుత్ సబ్సిడీకి రూ.12వేల కోట్లు, ఆయిల్‌పామ్‌కు రూ.వెయ్యి ట్లు కేటాయించింది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉంది.

– గువ్వల బాలరాజు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే అచ్చంపేట

అంకెల గారడీ



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదు. రూ.6,385 కోట్లతో రుణ మాఫీ ఎలా వీలవుతుంది. రూ.లక్ష లోపు రుణ మాఫీ కావాలంటే రూ.20వేల కోట్లు అవసరం. గిరిజనబంధు, నిరుద్యోగభృతి, అమరుల కుటుంబాలకు కేటాయింపులు లేవు. జనాభాలో 50శాతంపైగా ఉన్న బీసీలకు రూ.6,229కోట్లు మాత్రమే కేటాయించారు.

– చిక్కుడు వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్

ఖర్చుకు అవకాశం లేని బడ్జెట్ ఇది..



బడ్జెట్ పేపర్లలో రాయడానికి తప్పా, ఖర్చు చేసే బడ్జెట్ కాదు. గతేడాదిలానే మరో సారి దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలను మోసపుచ్చడానికి అవసరమైన అంకెల గారడిని రూపొందించారు. జిల్లాకు అవసరమైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజ్, పాలిటెక్నికల్ కళాశాల, అచ్చంపేటకు కాగితపు పరిశ్రమ లాంటి పరిశ్రమల ఊసే లేదు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో మిగిలిన పెండింగ్ పనులను పూర్తిచేయుటకు నిధులు ఇవ్వలేదు.

– బాల్‌నర్సింహ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

జనరంజకంగా ఉంది



రాష్ట్ర ప్రజలందరి ఆశలు, ఆశయాలు పూర్తిగా నెరవేర్చే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలతో బడ్జెట్ రూపకల్పన చేసి రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు సోమవారం శాసనసభలో బడ్జెట్‌ప్రవేశపెట్టారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి తదితర పథకాలకు వేలాది కోట్లు బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు.

– రాములు, ఎంపీ

కేంద్రం కళ్లు తెరిపించింది..



దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని భావించి దేశ ప్రజలు గర్వించే విధంగా ప్రజా రంజకంగా అందరికి స్ఫూర్తి బడ్జెట్ ఉంది. రాష్ట్ర బడ్జెట్ కేంద్ర ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేలా ఉంది. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధంగా బడ్జెట్ ప్రవేశపెడితే సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని రంగాలలో మౌలిక సదుపాయాలను సమకూర్చుకుని, ప్రజల, రైతుల, రైతు కూలీల, కార్మిక, కర్షక బడ్జెట్ ప్రవేశపెట్టారు.

– జైపాల్‌యాదవ్, ఎమ్మెల్యే, కల్వకుర్తి

విద్యారంగానికి పెద్దపీట



పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించడానికి 2023-24 విద్యా సంవత్సరానికి గాను అధిక నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం. మన ఊరు- మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ఆంగ్ల మాధ్యమం బోధించడానికి అనుగుణంగా ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇవ్వటం సంతోషకరమైన విషయం. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

– శ్యాంసుందర్‌గౌడ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఉప్పునుంతల

అర్హులందరికీ పోడు పట్టాలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: అర్హులైన ప్రతి ఒక్కరికి పోడు భూమి పట్టాలు ఇచ్చేవిధంగా చూడాలని కలెక్టర్ ఉదయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోడు భూమి పట్టాలపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటి వరకు ఎఫ్‌ఆర్‌సి కమిటీ నుంచి ఎస్‌డీఎల్ కమిటీకి సిఫారసు చేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏమైనా సందేహాలు వస్తే సంబంధిత పంచాయతీ సెక్రెటరీలను పిలిపించుకుని ఇంకా, అదనంగా ఏమైనా ఆధారాలు కావాలంటే వెంటనే తెప్పించుకుని న్యాయం జరిగేవిధంగా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోడు పట్టాలు ఇవ్వాలని, ఎప్పుడు ఆదేశాలు వచ్చిన ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మనూ చౌదరి, డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఆర్డీఓలు నాగలక్ష్మి, పాండు నాయక్, హనుమ నాయక్, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆధార్‌కార్డు మోసాలను అరికట్టాలి

కందనూలు: నకిలీ ఆధార్ కార్డు ద్వారా జరిగే మోసాలను అరికట్టేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీకి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ కార్యక్రమాల లబ్ధికి జన్మ తేదీని ఇష్టానుసారం మార్చడం, డూప్లికేట్ ఆధార్ కార్డులు సృష్టించడం వంటివి జరుగుతాయని, వీటిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన బిడ్డకు అక్కడే ఆధార్ కార్డు జారీ చేసేవిధంగా ఏర్పాట్లు ఉంటాయని ప్రైవేట్ ఆసుపత్రిలో పుట్టిన వారికి బర్త్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా బయట చేయించుకోవచ్చన్నారు. 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు బయోమెట్రిక్ ఉండవు కాబట్టి 5 సంవత్సరాల తర్వాత పిల్లలకు పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అప్డేషన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. అన్ని ఆధార్ సెంటర్లు ప్రభుత్వ స్థలాల్లోనే ఉండేవిధంగా చూడాలని, కార్డు పొంది పదేళ్లు దాటిన వారు ఖచ్చితంగా ఆధార్‌ను అప్‌డేషన్ చేయించుకోవాలన్నారు. డీఎస్పీ మోహన్, డీడబ్ల్యూఓ వెంకటలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్, మీ సేవా సెక్షన్ సూపరింటెండెంట్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయ్..



తెలకపల్లి: విద్యుత్ కోతలను నివారించి నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు సోమవారం తెలకపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని రాంరెడ్డిపల్లి, చిన్నముద్దునూరు గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. పగలు, రాత్రి సమయాల్లో కూడా విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎపుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటలకు నీరందక ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి రోజు 8-9 గంటల కంటే ఎక్కువ విద్యుత్ సరఫరా కావడం లేదనిన్నారు. 24 గంటలు విద్యుత్‌సరఫరా అందజేయాలని డిమాండ్ చేశారు. అచ్చుతారెడ్డి,రాజవర్ధన్‌రెడ్డి, బాలగౌడ్, లక్ష్మణ్, నిరంజన్, చెన్నరాయుడు పాల్గొన్నారు.

ఖైదీలకు న్యాయ సహాయం



లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ భవనాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: జైల్లో మగ్గుతూ.. క్రిమినల్ లాయర్‌ను పెట్టుకోలేని స్థితిలో ఉన్న ఖైదీలు న్యాయం పొందేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ అన్నారు. సోమవారం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ నవీన్‌రావుతో కలిసి హైకోర్టు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1987 యాక్టు ప్రకారం జస్టిస్ వెంకటాచలయ్య కృషి మేరకు అట్టడుగు వర్గాలకు సైతం న్యాయం దక్కాలి అనే ఉద్దేశ్యంతో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు పునాది పడిందని, చీఫ్ జస్టిస్ యూ.యూ. లలిత్ ప్రోద్బలంతో ఇప్పుడు రాష్ట్రాలలోని జిల్లా కోర్టులలో ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. 16 లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పనితీరు బాగుంటే రాబోయే రోజుల్లో అన్ని జిల్లాల్లో ప్రారంభించుకునేందుకు కృషిచేస్తామని తెలియజేసారు.

పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం

రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు నవీన్ రావు, జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి జస్టిస్ డి.రాజేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా 16 కోర్టుల్లో నేడు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రారంభించుకోగా అందులో నాగర్‌కర్నూల్ ఉండటం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వరూప, కల్వకుర్తి సీనియర్ సివిల్ జడ్జి కుమారస్వామి, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ హన్మంత్ రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో వాహనాలు ఆపొద్దు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షత అభయారణ్యం పరిసర ప్రాంతంలో ఎలాంటి వాహనాలను కూడా ఆపవద్దని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు మొదలుకొని దోమలపెంట వరకు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ కూడా వాహనాలు నిలపరాదని అన్నారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తున్నందున అటవీ ప్రాంతం అంతా ఎండుగడ్డి, ఆకులతో ఉంటుందని వివరించారు. ప్రయాణికులు, యాత్రికులు మార్గ మధ్యన వాహనాలు నిలిపి బీడీ, చుట్ట లేదా వంటలు తయారు చేసుకునే ప్రయత్నాలు చేస్తే ప్రమాదవశాత్తు అగ్గి రాజుకొని అడవి తగలబడే అవకాశం ఉందన్నారు. రోడ్డు పక్కగా కనిపించే కోతులకు ఆహార పదార్థాలు వేయరాదని, వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా వన్యప్రాణులకు ప్రమాదాన్ని కలిగించే ప్లాస్టిక్ వస్తువులు అటవీ పరిసర ప్రాంతంలో పడవేయరాదని ఆయన పేర్కొన్నారు.

అడవులను రక్షించుకుందాం



ఎర్రపెంటలో చెంచులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ రేంజర్ జయదేవ్

లింగాల: వేసవిలో నల్లమల అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతి కాకుండా రక్షించుకుందామని డిప్యూటీ రేంజర్ జయదేవ్ ప్రజలను కోరారు. సోమవారం అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రపెంట, పద్మన్నపల్లిలో అడవుల రక్షణకు సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవిలో నల్లమల ప్రాంతంలో మంటల చెలరేగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలకు అటవీ శాఖకు సహకరించాలని కోరారు. అటవీ ప్రాంతానికి వెళ్లే పశువులు, గొర్రెలు, మేకల కాపర్లు ఎట్టి పరిస్థితుల్లో నిప్పు పెట్టవద్దని, అలాగే ఇప్పపూల కోసం వెళ్లే వారు ముందుగా అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మాలధారణ చేసిన శివస్వాములు శివరాత్రికి అడవి గుండా శ్రీశైలం వెళ్లుటకు అనుమతి ఉండదని, వన్య మృగాల వలన ముప్పు ఉండే అవకాశాలు ఉన్నాయని, రోడ్డు మార్గం వెంటనే వెళ్లాలని సూచించారు. బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాష, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

యువత వ్యవసాయ రంగంలోకి రావాలి



మాట్లాడుతున్న కోటా నాయక్

కల్వకుర్తి రూరల్: యువత వ్యవసాయ రంగంలోకి రావాల్సిన అవసరం ఉందని ఉమ్మడి జిల్లా యువజన అధికారి కోటా నాయక్ పిలుపునిచ్చారు. పట్టణానికి చెందిన స్వామి వివేకానంద యువక బృందం భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువక కేంద్రం మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో సోమవారం కల్వకుర్తిలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యువకులకు సేంద్రియ వ్యవసాయం, వర్మీ కంపోస్టు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపై సావిత్రిబాయి పూలే కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో కోటా నాయక్ మాట్లాడుతూ భవిష్యత్ రోజుల్లో వ్యవసాయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. యువకులు వ్యవసాయంలోకి రావాలని అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని అన్నారు. జాతీయ ఉత్తమ సేంద్రియ రైతు అవార్డు గ్రహీత రమణా రెడ్డి ప్రకృతి వ్యవసాయంపై, కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. లక్ష్మీనారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి, రాజేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బురదలో పడి వ్యక్తి మృతి


ఆంజనేయులు (ఫైల్)

కోడేరు: బురదలో ఇరుక్కొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో సోమవారం చోటుచేసుకుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన జరుపటి ఆంజనేయులు(50) తన కుటుంబీకులతో ఆదివారం వడ్డెక్ల మశమ్మ గ్రామదేవత పండుగ చేశారు. దగ్గరలో ఉన్న తన వ్యవసాయ వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఒడ్డుపై నుంచి నడిచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బురదలో కాలు ఇరుక్కొని బోర్ల పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం అటుగా వెళ్తున్న వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య యాదవవేణి ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తూడుకుర్తిలో ఆదివారం చోటు చేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బంగారయ్య (42) కుటుంబంలో కొంతకాలంగా కలహాలు చోటు చేసుకున్నాయి. మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి చెల్లెలు చిట్టెమ్మ సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య


శ్రీను (ఫైల్)

గోపాల్‌పేట: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన కుర్మయ్య, శంకరమ్మకు ఒక కూతురు, కుమారుడు ఉండగా సుమారు మూడు నెలల క్రితం కూతురు వివాహం చేశారు. ప్రస్తుతం తల్లిదండ్రులు బెంగుళూరులో పనులు చేసుకుని బతుకుతున్నారు. కుమారుడు యాపచెట్టు శ్రీను (30) సైతం అక్కడే ఉండి పనిచేసేవాడు. కొన్నిరోజుల క్రితం గ్రామానికి వచ్చి తాగుడుకు బానిసయ్యాడు. ఆదివారం తాగిన మైకంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కొద్దిసేపటికే చుట్టుపక్కలవారు గమనించి వనపర్తి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని డాక్టర్లు నిర్ధారించారు. తండ్రి కుర్మయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.


హత్య కేసులో నలుగురి అరెస్ట్

ఉండవెల్లి: హత్య కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాలరాజు సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మధుసూదన్‌రెడ్డి (35)ని నలుగురు వ్యక్తులు 3వ తేదీ రాత్రి దాడి చేయడంతో ఆయన మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా సోమవారం రాఘవేంద్ర గౌడు, బోయ యాగంటి నాయుడు, బోయ గణేష్, బోయ రూబి కోదండాపురం బస్టాండ్‌లో పట్టుకున్నారు. వారిని విచారించగా మధుసుదన్‌రెడ్డి గతంలో రాఘవేంద్రగౌడు ఇంట్లో అద్దెకు ఉండడంతో తన భార్య కృష్ణవేణితో చనువుగా ఉందని ఇల్లు ఖాళీ చేసి కర్నూల్‌కు వెళ్లిపోయారు. మాటిమాటికి ఫోన్ చేస్తుండడంతో ఆయనను రమ్మని చెప్పి కాపు కాసి కర్రలతో దాడి చేశారని ఎస్ఐ తెలిపారు. నిందితుల వద్ద ఉన్న 2 బైకులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

పెద్దకొత్తపల్లి: చిన్నకొత్తపల్లి చెందిన తిప్పరాజు చంద్రమౌళి నివాస గుడిసె ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఇంట్లో వస్తువులు, దుస్తులు, బియ్యం దగ్ధమై రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

తెగిన కేఎల్ఐ కాల్వ: నిలిచిన సాగునీరు



కోడేరు: మండలంలోని ముత్తిరెడ్డిపల్లి శివారులో కేఎల్ఐ కాల్వ తెగి సాగునీరు వృథాగా పోతుంది. జొన్నబొగుడ రిజర్వాయర్ నుంచి విడుదల అవుతున్న సాగునీరు కోడేరు, పాన్‌గల్ మండలాలకు అధికారులు రైతుల పంట పొలాలకు సాగునీరు విడుదల చేస్తున్నారు. సోమవారం ఉదయం ముత్తిరెడ్డి బ్రాంచ్ కెనాల్ వద్ద కాల్వ తెగిపోవడంతో నీరంతా సమీపంలోని వాగులోకి వెళ్తుంది. చుట్టుపక్కల రైతులు చూసి వెంటనే డీఈ రవీందర్‌రెడ్డికి సమాచారం అందించడంతో సాగునీటి సరఫరా నిలిపివేశారు. త్వరలో మరమ్మతు చేపడుతామని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

శ్రీనివాసా గోవిందా..!

వైభవంగా మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

- భక్తిశ్రద్ధలతో గరుడ వాహనసేవ
- ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- హరినామ స్మరణతో మార్మోగిన మన్యం గిరులు


రథోత్సవానికి హాజరైన భక్తులు


రథం వద్ద హారతి ఇస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: నిండు పున్నమి వెన్నెలలో మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవాన్ని తిలకించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సుమారు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

గరుడ వాహనంపై తేరు మైదానానికి..

స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి గర్భగుడి నుంచి గరుడ వాహనంపై మెట్ల మార్గంలో తేరు మైదానానికి భారీ ఊరేగింపుగా తీసుకొచ్చారు. బంగారు ఆభరణాలు, కాగడాల వెలుతురు మధ్య పూలమాలల ధారణలో పద్మావతి, లక్ష్మీదేవి సమేత స్వామివారు ధగధగా మెరుస్తూ భక్తకోటికి దర్శనమిచ్చారు. మేళతాళాలు, పురోహితుల వేద మంత్రోచ్చారణ నడుమ ఊరేగింపు ముందుకుసాగింది. అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, మామిడి తోరణాలు, రకరకాల పూలతో ముస్తాబు చేసిన రథంపై ఉత్సవ విగ్రహాలను ఉంచారు. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి రథోత్సవంలో పాల్గొన్నారు. అంతకుముందు సాంప్రదాయ రీతిలో తేరు మైదానంలో రథం ముందు కుంభం పోసి రథంపై ఉన్న స్వామి, అమ్మవార్లకు మహా మంగళహారతి ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోవిందా.. గోవిందా అంటూ స్వామివారి రథాన్ని ముందుకులాగి భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. రథం లాగే సమయంలో మహిళలు పెద్దఎత్తున పూనకాలు నిండారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా భారీఎత్తున బాణాసంచా కాల్చారు. రథోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాలను తిరిగి గరుడ వాహనంపై మెట్ల మార్గంలో గర్భగుడిలోకి తీసుకెళ్లారు.

ముఖ్యమంత్రి ఆశీస్సులతో మరింత అభివృద్ధి

ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆశీస్సులతో వచ్చే ఏడాది ఉత్సవాల నాటికి మన్యంకొండ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రథోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన్యంకొండ ఆలయం తెలంగాణలోనే అత్యంత ప్రాధాన్యం ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతోందని, రాష్ట్రం నుంచేగాక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తున్నారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం వచ్చిందని, యాదాద్రి, వేములవాడ, సమక్క-సారళమ్మ ఆలయాల సరసన మన్యంకొండను నిలుపుతామని చెప్పారు. వచ్చే సంవత్సరం వరకు రాష్ట్రంలోనే మొదటి రోప్‌వే ఇక్కడ ఏర్పాటు చేయించి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. భక్తుల సౌకర్యార్థం వసతిగృహంతో పాటు వందలాది పెళ్లిళ్లు జరిగేలా షెడ్లు వేయించామని.. అన్నదానంతో పాటు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు మంత్రి హాజరై కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, ఎస్పీ నరసింహ, అదనపు ఎస్పీ రాములు, మన్యంకొండ ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌గౌడ్, పాండురంగారెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు


తిలకిస్తున్న జనం

ఘనంగా శకటోత్సవం

- లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఉడిపి పీఠాధిపతి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శకటోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిసరాల్లోని తండాలు, గ్రామాల నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు అలంకరించి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం చుట్టూ గోవింద నామస్మరణల మధ్య ప్రదక్షిణలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు సోమవారం ఉడిపి పీఠాధిపతి శ్రీవిద్యాధీశతీర్థులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ పురోహితులు సాదర స్వాగతం పలికారు. స్వామి అనుగ్రహం ప్రజలందరికీ ఉండాలని పీఠాధిపతి కోరుకున్నారు.

రథోత్సవంలో అపశృతి..

బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన రథోత్సవంలో అపశృతి నెలకొంది. రాత్రి పూజలు అనంతరం 11.15నిమిషాలకు రథోత్సవం నిర్వహిస్తుండగా రథచక్రాలను నియంత్రించే సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చక్రం కడ్డీలు విరిగిపోయాయి. దీంతో హుటాహుటిన రథోత్సవాన్ని నిలిపివేసి జాకీల సహాయంతో రథం కిందపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చక్రం కడ్డీలను వెల్డింగ్ చేయించి 12తరువాత రథోత్సవం కొనసాగించారు.


స్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్న ఉడిపి పీఠాధిపతి

పంట అవశేషాలతోనే వర్మీకంపోస్టు ఎరువు


వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: పంటకోత అనంతరం మిగిలిన పంట అవశేషాలతోనే వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసుకోవచ్చని పాలెం కేవీకే సమన్వయకర్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గంగారంలో గిరిజన ఉప పథకంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంలో గిరిజన రైతులకు వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు సేంద్రీయ సాగువైపు అడుగులు వేయాలని, ముందుగా ఆహార పంటలో సేంద్రీయ పద్ధతిని అవలంభించి పంటలను సాగు చేయాలని సూచించారు. అంతేకాకుండా వర్మీ కంపోస్టు వంటి ఎరువుల్ని పొలం వద్దనే రైతులు తయారు చేసుకుని పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడమే కాకుండా అధిక దిగుబడుల్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధులు సుధాకర్, రజిత, ఏఈఓ ఫరీద్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పందుల డిష్యుం.. డిష్యుం


పోటీల్లో తలపడుతున్న పందులు

- దౌదర్‌పల్లిలో ఆకట్టుకున్న పోటీలు

గద్వాల అర్బన్: సంక్రాంతి అనగానే సాధారణంగా కోళ్ల పందేల సందడి గుర్తుకొస్తుంది. ఇక ఎద్దుల పోటీలు తెలుసు. కానీ, పందుల పోటీల గురించి ఎక్కడైనా చూశారా.. కనీసం విన్నారా.. ఈ పందుల పోటీలు ఏమిటి అనుకుంటున్నారా.. వినడానికి కాస్త కొత్తగా.. చూసేందుకు ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది నిజమే. జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని దౌదర్‌పల్లి శివారులో పందులు తలపడ్డాయి. భూలక్ష్మీచెన్నకేశవస్వామి జాతర సందర్భంగా ఇక్కడ ఊరపందుల మధ్య పోటీలు నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర 20 రాష్ట్రాల నుంచి పలువురు వరాహాలతో వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. రెండేసి వరాహాల మధ్య పోటీలు నిర్వహించి గెలుపొందిన వరాహం యజమానులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. మొదటి స్థానానికి రూ.30 వేలు, ద్వితీయ రూ.20 వేలు, తృతీయ రూ.10 వేల నగదు అందజేశారు. పోటీలను చూసేందుకు చుటుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

వరిలో చీడపీడల నివారణ ముఖ్యం


వెంకటాంపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఖిల్లాఘనపురం: వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు చీడపీడలను నివారించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వర్మ, డాక్టర్ కిరణ్ తెలిపారు. సోమవారం మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లి, ఖిల్లాఘనపురం, వెంకటాంపల్లి లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరికి చీడపీడల ప్రభావం ఎక్కువగా ఉందని.. జింకులోపం, చౌడు నేలల ప్రభావం, సల్ఫర్ ప్రభావం, కాండం తొలుచు పురుగుతో ఎదుగుదల తగ్గిందన్నారు.

జింకు లోపం నివారణ చర్యలు..

చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో మొక్కలు పోషకాలను తీసుకోకపోవడంతో వరిలో జింకు లోపం సమస్య ఏర్పడుతుందన్నారు. పంట పూర్తిగా గిడసు బారిపోతుందని.. నివారణకు జింక్‌సల్ఫేట్ 250 గ్రా.ఎకరానికి 5 రోజుల వ్యవధిలో రెండు దఫాలు పైపాటుగా పిచికారీ చేయాలన్నారు.

చీడపీడల నివారణ..

చౌడు నేలల్లో నెల రోజుల వరకు చౌడు ప్రభావంతో మొక్కలు ఆక్సీజన్ తీసుకోలేవని.. దీంతో మొక్క ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. నివారణకు నిండుగా నీళ్లు పెట్టి కలుపు తీయించిన తర్వాత నీటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. సల్ఫర్ ప్రభావం ఉన్న పంట వేర్లు నల్లగా మారి కుదురు మొత్తం కోడి గుడ్డు వాసన వస్తుందన్నారు. నివారణకు వెంట్రుక మందం నెర్రలు వచ్చే వరకు ఆరబెట్టి తరువాత యూరియా, కార్బండిజమ్ మాంకొజెబ్ కలిపి వెదజల్లాలన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణ..

తరుచుగా వరి సాగు చేసే పొలం నుంచి కాండం తొలుచు పురుగు ఉధృతి పెరుగుతుందన్నారు. నివారణకు 4జీ గుళికలు లేదా పంట నాటిన 45రోజుల వరకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 5కిలోలు చల్లాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, మండల రైతు సమితి కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, ఏఈఓలు పాల్గొన్నారు.

మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో, మన్యంకొండ దేవస్థానం సహకారంతో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న రాత్రి 7 గంటల నుంచి శాస్త్రీయ నృత్య ప్రదర్శన (చంద్రముఖి ఆర్ట్స్ అకాడమీ, మహబూబ్‌నగర్) శ్రీకృష్ణ రాయబారం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ఉంటుందని పేర్కొన్నారు. 12న స్వర లహరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయబారం, ధర్మజ రాజసూయం, 13న వివిధ సంస్థలచే శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, శ్రీకృష్ణరాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధ ఘట్టం, మాయలపకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం, 14న నవజ్యోతి కళానిలయం (జడ్చర్ల) వారిచే మైరావణ నాటకం, శ్రీకృష్ణరాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, 15వ తేదీన భజనలు, హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ఎదుట క్షుద్ర పూజలు

కోడేరు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ గేట్ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్తుండగా గేట్ వద్ద సున్నంతో ముగ్గు వేసి అందులో కొబ్బరికాయ, నిమ్మకాయలు, ఇనుప మేకు, జీడి గింజలు, బొగ్గు పెట్టారు. ఈ విషయంపై ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని వాటిని తొలగించారు. విద్యార్థులు భయాందోళన చెందవద్దని పోలీసులు మనోధైర్యం ఇచ్చారు. నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసి ఎవరైనా ఇలాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఐరన్ కంపెనీని ఎత్తివేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/బాలానగర్: బాలానగర్ మండలంలోని గుండేడ్ గ్రామ పరిధిలోని మహావీర్ ఫిరోలెస్ ఐరన్ కంపెనీని ఎత్తివేయాలని గుండేడ్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేడ్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ రావాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కంపెనీ వల్ల గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నారని, పంటలు కలుషితం అవుతున్నాయని తెలిపారు. కంపెనీ కోసం వందల కుటుంబాలను బలి చేస్తారా అని ప్రశ్నించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. ధర్నాలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న గుండేడ్ గ్రామస్తులు

రుణాలు ఇప్పిస్తామని మోసం

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐలు శ్రీనివాసాచారి, శ్రీనివాసరెడ్డి

వనపర్తి క్రైం: రుణాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఎస్ సీఐ శ్రీనివాసచారి, కొత్తకోట సీఐ శ్రీనివాసరెడ్డి వివరాలు వెల్లడించారు. నెల్లూరుకు చెందిన సుధాకర్ సినీ ఫీల్డ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో చిత్తూరు, నెల్లూరు ప్రాంతాల్లో బాబాలతో గుప్తనిధులు తీయించి ఇస్తానని అమాయకులతో డబ్బులు తీసుకొని మోసం చేసేవాడన్నారు. ఇదే క్రమంలో చిత్తూరు జిల్లాలో గుప్తనిధులు తవ్వుతుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు తర్వాత బెంగుళూరులో ఫేక్ కంపెనీ అయినా ఏఎంపీ క్యాపిటల్ ఇండియా నిర్వహిస్తున్నారు. అజిత్, పురుషోత్తం, వినోద్, రాజశేఖర్, నాగరాజుతో కలిసి పనిచేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇతను దీంతో పాటు తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని మోసాలు చేసేవాడు. ఈ క్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన సోహెల్ ట్రాక్టర్ షోరూం నడుపుతున్నాడు. ఇతను వ్యాపారం పెంచుకునేందుకు రుణం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈయనకు ట్రాక్టర్ బేరింగ్‌లు సప్లయి చేసే చిలకలూరిపేటకు చెందిన రాజు సుధాకర్‌ను పరిచయం చేశాడు. దీంతో ఎంతైనా రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పడంతో సోహెల్ రూ.25లక్షలు డీడీ ద్వారా ఇచ్చాడు. ఆ తర్వాత అతని నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మోసపోయానని తెలుసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోహెల్ ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు సుధాకర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద రూ.2.98 లక్షలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఎస్ఐ రుషికేష్, పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డి, సిబ్బంది తిరుపతిరెడ్డి, సమరసింహారెడ్డి, రైటర్ నాగరాజు, ఐటీ కోర్ మురళీని అభినందించారు.

కనిపిస్తే ‘100’కి కాల్ చేయండి


పోలీసులు గుర్తించిన అజ్ఞాత దొంగలు


మరో యువకుడు


ఓ యువకుడు

బిజినేపల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురు యువకుల ఫొటోలను సోమవారం బిజినేపల్లి ఎస్సై కృష్ణ ఓబులరెడ్డి విడుదల చేశారు. ప్రస్తుతం బిజినేపల్లి, కుమ్మెర, మంగనూర్, వట్టెం గ్రామాల్లో జాతరలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వీరు అక్కడే ఎక్కువగా సంచరించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే సంత మార్కెట్‌లో కూడా ఎక్కువగా తిరుగుతారని, ఎక్కడ కనిపించినా 100కు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.